

# దేవాలయం

పి.వి.బి. శ్రీరామమూర్తి

చంద్రం ముందుకెళ్తున్నాడు!

కానీ–

అతను అడుగు తీసి అడుగు వెయ్యలేకపోతున్నాడు. పాదాలు బరువెక్కి తడిసిన సిమెంటు బస్తాల్లా ఉన్నాయి. మనసు మొద్దుబారిపోయింది. తల తిరుగుతున్నట్లుంది. కళ్ళు బైర్లు ఎక్కిపోతున్నాయి.

చంద్రం ఆలోచనలు తల్లి చుట్టూ తిరుగుతున్నాయి.

ధర్మారావుగారి ప్రసంగం చంద్రాన్ని ఉత్తేజితుణ్ణి చేసింది. అతని మాటలు తూటాల్లా గుండెల్లో గుచ్చుకున్నాయి. బాణాల్లా రొమ్మును చీల్చాయి. కందిరీగల్లా పొడుస్తున్నాయి.

'మదర్స్ డే' సందర్భంగా ఆయన ఇచ్చిన ఉపన్యాసం మహాద్భుతం! ఆయన ఒక్కో వాక్యం పలుకుతూంటే సభ చప్పట్లతో మారుమ్రోగిపోయింది.

''సృష్టికి ఆరంభం అమ్మ.

అక్షరాలలో మొదటి అక్షరం... 'అ'మ్మని అలంకరించింది!

రెండు పెదాలు కలిస్తే అమ్మ! రెండు పదాలు కలిసి విచ్చుకుంటే వచ్చే మధుర ధ్వని అమ్మ! శిశువు నోరు విప్పి పలికే తొలిపదం అమ్మ! అమ్మకు సాటి వేరెవ్వరున్నారు?

పురణాలు తిరగేయండి... హిరణ్య కశిపుడు కన్న కొడుకు అని కూడా చూడక అన్ని బాధలు పెట్టాడు ప్రహ్లాదుణ్ణి! తల్లి ఒక్క మాటన్నదా? కొడుకును వారించిందా? కొడుకును భర్త మూర్ఖంగా... దారుణంగా... క్రూరాతి క్రూరంగా హింసిస్తోంటే రోదించేదే కాని. బాధించిందా? ఒరే కుర్రకుంకా! తండ్రికెదురు చెప్తావా? నా కడుపున చెడపుట్టావు రా? అన్నదా?- ఎందుకని? ఆమె అమ్మ కాబట్టి!

తన కన్నకొడుకు ప్రాణాలు రక్షించుకోవాలనుకుందేగానీ... తను కారాగారంలో బందీకృతురాలైపోయినందుకు లేశమ్మైనా రోదించిందా దేవకీ మాత? ఆ కన్నని కన్నతల్లి? ఎందుకని? ఆమెకు బిడ్డ క్షేమమే కావాలి కనక!

ముద్దుల పెళ్ళాంకిచ్చిన వరాలను తీర్చటానికి ఆ ముసలి రాజు దశరథుడు వరపుత్రుడని కూడా చూడక రాముణ్ణి నిర్దాక్షిణ్యంగా అడవులకు పంపాడు. కానీ కన్నతల్లి 'కౌసల్య' ఎంత రోదించింది? ఎన్ని రాత్రులు నిద్రలేకుండా వేకువలు చూసింది? ఎన్ని సంవత్సరాలు ఆకలి మరచి కొడుకు రాక కోసం ఎదురు చూసింది?

ఎందుకని?

ఆమె అమ్మ కనక! గుండెలు చీల్చి, స్తన్యాన్నిచ్చి పెంచిన తల్లి గనక!

(చప్పట్లు...చప్పట్లు!)

అమ్మ వాడని పువ్వు! అమ్మ చెరగని నవ్వు! సృష్టికి మూలం అమ్మ!''- ఇలా కవిత్వంలా అతని ఉపన్యాసం పరుగులు తీస్తోంది.

చంద్రం అసహనంగా కదిలాడు.

''మీరింటికెళ్ళగానే మీకోసం ఎదురుచూసే మీ భార్య కనిపిస్తుంది... చేతులో మల్లెలో...మొల్లలో... కొనాలన్న పట్టుచీరో, రవ్వల నెక్లెసో... కనిపించలేదనుకోండి... ఆమె మీకు కనిపించదు...భార్యలా! కనిపిస్తుంది అపర కాళికలా! (చప్పట్లు!...చప్పట్లు!)

ఎదురుగా 'నాన్నా' అంటూ చేతులు చాచుకుంటూ వచ్చిన మీ పాపకో, బాబుకో...రోజూలా కానుకలతో గాక...ఒట్టి చేతులతో కనిపించారనుకోండి... పాప మీ చేతుల్లోంచి దిగి... అలకపాన్పును అల్లుకుపోతుంది! అలసిసొలసిన మీరు ఇంటికెళ్ళే సరికి... సాదరంగా... 'రా నాన్నా! అలాగున్నావు. అన్నానికిరా. కాళ్ళు కడుక్కో!' అని ఆప్యాయంగా అమృతాన్ని అందిచ్చేది ఎవరు?... అమ్మ! ఆమెక్కాదామె సుఖం!

అమ్మే దేవత! అమ్మే సత్యం! అమ్మే నిత్యం! అమ్మని కాననివాడు కళ్ళున్న గుడ్డివాడు. అవసాన దశలో అమ్మని ఆదుకోనివాడు అసురలకే అగ్రజుడు! (అసురులు కూడా తల్లిని బాధించలేదండోయ్!-మళ్ళీ)

-ఇలా సాగుతున్న ధర్మారావుగారి ప్రసంగం 'చంద్రం'వంటి మీద తేళ్ళూ, జెర్రెలూ పాకినట్లు చేస్తోంది!

అమ్మ అతని కళ్ళ ముందు కదిలింది.

అమ్మను చూసి కొన్ని సంవత్సరాలయ్యింది.

-ఆ రోజు అమ్మ చేతిలో యాభై రూపాయలు పెట్టి వచ్చేస్తున్నాడు. ఆమె అన్న చివరి మాటలు ''కన్నా! నాకెందుకురా డబ్బులు? నువ్వక్కడెన్ని కష్టాలు పడుతున్నావో ఏటో? అప్పుడప్పుడూ సూసిపోరా? నాకు వోరం రోజులు వణ్ణం నేపోనా పరవానేదురా! నీ రాకతో నా కడుపు నిండిపోనాదిరా! ఒరే, నా సేతులతో నీకు బువ్వపెట్టి ఎన్నాల్లయిందో, పాపిస్టి దానిని... రెండు మెతుకలన్నం వొండి ఎట్టనేపోనాను. ఎండలో వొచ్చి ఎల్లిపోతన్నావు. మల్లీ ఎప్పుడొత్తావో...'' అని కంటతడిపెట్టినపుడు చంద్రం వొళ్ళు తిమ్మిరెక్కిపోయింది.

అప్పుడనుకున్నాడు.

నెలకోసారయినా అమ్మను చూసి రావాలని!

కానీ-

అప్పుడే మరచిపోయాడు వాటిని!

పరిస్థితులు మరిచిపోయినట్లు చేసాయి.

దీనిక్కారణం... కవిత!

'కవిత'ను పెళ్ళి చేసుకున్నపుడు అమ్మ ఎన్ని ఇబ్బందులు పడింది? ఎన్ని అవమానాలు ఎదుర్కొన్నది? 'కవిత'- ఆ ఊరి పాలేరు కూతురు. బి.ఎస్సీలో చంద్రంతో కలిసి చదువుకుంది.

చంద్రం తండ్రి భూస్వామీ కాదు. ఊరికి నాయకుడూ కాదు... చిరుద్యోగీ కాడు! రెండెకరాల పొలం చంద్రం తండ్రి ఆస్తి! ఓ మిద్దె ఇల్లు... ఓ బండీ... జత పోతులు... నాలుగు మేకలు...! వెరసి కడుపు పూర్తిగా నిండని ఆదాయం... అర్ధాకలి...అత్తెసరు బ్రతుకూ! పంచాయితీ బోర్డు మెంబరు!

సర్పంచ్ ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ సంతకం పెట్టడం... అతడిచ్చిన మందు తాగటం... దానికే ఎంతో గర్వపడిపోయేవాడు.

ఓ ఎన్నికల్లో తండ్రి ఓటమి పాలయ్యాడు. సర్పంచ్ మందుపొయ్యటం మానేసాడు. అక్కణ్ణుంచీ మేకలూ...పోతులూ...బండీ...పొలం... ఒక్కొక్కటీ హరించుకుపోయాయి. పూలమ్మిన చోటే కట్టెలమ్ముకోవలసిన స్థితి. సిగ్గు విడిచి, కాఫీ హోటలు పక్క అర్ధగంట దేబిరిస్తే ఓ టీ చుక్క పోస్తే... దాంతో పెదాలు తడుపుకొని... ఇంటికొచ్చి అన్నం వండ లేదని తల్లికి చీవాట్లు. కోపంతో తల్లి




ఎదురు తిరిగినపుడు కనిపించిన కర్రతో గొడ్డును బాదినట్లు బాదుడు!

తల్లి ఏడ్చేది. కళ్ళు తుడుచుకునేది. బిక్కుబిక్కు మని చూస్తోన్న చంద్రానికి ఓ పావలాకాసో, అర్థరూపాయి బిళ్ళో ఇచ్చి ''అయ్యా! సక్కిరాలో, పుటుకులో కొనుక్కో. పోయి సదూకో. అయ్య మంచోడే! ఏటి సేత్తాం... ఒడలు బల్లు అయినపుడు ఎటువంటోడయినా ఇముడ్చుకోనేడు. ఇయ్యన్ని బుర్రలోనెట్టుకోని...సదువు పాడు సేసుకోకు!'' అని ఓదార్చేది.

అమ్మనంటుకుపోయి బావురుమని ఏడవాలనిపించేది చంద్రానికి. కానీ చంద్రం ఏడిస్తే వాళ్ళమ్మ తట్టుకోలేదు, అందుకే ఏడుపుని దిగమింగుకునే వాడు.

కానీ, అమ్మ చెప్పినట్లే పరిస్థితుల్ని పక్కకినెట్టి- చదువుల సముద్రంలో ఈత సాగించాడు. బి.ఎస్సీ ఫస్టు క్లాసులో పాసయ్యాడు. గ్రామీణ బ్యాంకులో ఉద్యోగం సంపాదించేడు. కవిత కూడా గ్రామీణ బ్యాంకులో చంద్రంతోనే సెలెక్టయింది. ఒకే చోట ఉద్యోగం పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. మొదట్లో కేవలం పరిచయస్తులుగానే ఉండేవారు. కానీ 'కొలీగ్స్' మాత్రం వాళ్ళిద్దరి మధ్యా ఏదో బంధమో, సంబంధమో ఉందనుకునేవారు. కొందరైతే 'పప్పన్నం ఎప్పుడు పెడతారు?' అని అడగటం మొదలెట్టారు

అప్పుడు చంద్రంలోనూ ప్రేమబీజాలు మొలకలెత్తాయి. కవిత అందగత్తే, తెలివైనదే. కానీ కూలాల పట్టింపులు పల్లెల్లో చాలా ఎక్కువ. ఇన్నిటికి మించీ వాళ్ళ కులంలో- ముఖ్యంగా వాళ్ళింట్లో కవిత ఒక్కతే చదువుకున్నది కావటం చేత వాళ్ళింట్లో ఆమె పట్ల వల్లమాలిన ప్రేమ. అభిమానం. అందువల్ల కుటుంబంలో వాళ్ళు ఇచ్చే విలువ పెంచిన గర్వం కవితలో కొంచెం ఎక్కువే!

అయితే అభిమానం ఎక్కువయినపుడు అసమానతలు కనిపించకపోవటం చేత చంద్రంకి ఆమెలో కనిపించే ఆ గర్వం కూడా ఆమె అందంలో ఓ భాగంగానే కనిపించింది.

చంద్రం తన మనసులో భావాన్ని ఆమె ముందుపెట్టాడు.

కవిత కూడా అంగీకరించింది.

తల్లి అంగీకరిస్తుందో, అంగీకరించదోనని భయపడ్డాడు చంద్రం. అప్పటికి తండ్రి పోవటం చేత తండ్రి భయం లేకపోవటంవల్ల. కానీ, విచిత్రం ఏంటంటే- కవిత కుటుంబం తల్లిమీద దాడి చేసారు. 'ఊళ్ళో తాము బతకటం ఇష్టంలేదా?' అంటూ-తల్లి కూలీ, నాలీ చేసుకుని నానా కష్టాలు పడుతుంటే పట్టించుకోని మేనమావలూ, తండ్రి అడుక్కుని హీనాతిహీనంగా జీవిస్తున్నా అవసరం లేని కులం పెద్దలూ- తల్లినే తిట్టిపోసారు.

తల్లి అందరికీ ఒక్కటేమాట చెప్పింది.

''ఆడు నా కొడుకు... ఆడు మనసు పడ్డాడు. ఆ పిల్ల నా కొడుకునిస్టపడినాది... ఆడిస్టమే నా ఇష్టం...ఆణ్ణికాదని ఆణ్ణిబ్బందిపెట్టి నానీడ్చుకుపోయిందీ ఏంనేదు... ఇక కులమంతారా? అల్ల పొలాల్లో నాను కూలిసేసినాను... ఆల్లిచ్చిన డబ్బుల్తో నాను తిండి తిన్నాను. అప్పుడు నేని కులం ఉప్పుడొచ్చిందా?'' అని కులం వాళ్ళని నిలదీసింది.

''అవునే... ఆ గుంట తెచ్చిన జీతం డబ్బులు... నీ కల్లనీ... నీ కొడుక్కల్లన్నీ కప్పేసినాయి. నీక్కులమూ అక్కర్నేదూ... జాతీ అక్కర్నేదు... జాత్తక్కవదానా? నీతిమాలిన దానా? సీ... నువ్వు బతికినావ్... కుక్కా బతికినాది... బతుకే బతుకు!'' అని ఆడాళ్ళు చంద్రం తల్లి ముఖం మీద ఉమ్మేసారు. మేనమామలు రెక్కపట్టుకొని ఇంట్లోంచి ఈడ్చి బయటకు తగిలేసారు.

ఇక కవిత తరువు వాళ్ళు....


''ఏమ్మా! మా 'యామ్మే' నీ కొడుక్కి దొరికినాదా? నీ నుండి మాం ఊర్లోనందరికీ పెద్దయిపోవా? మాకు పనుల్లోకి రానిత్తారా? ఇదేదో మాం ఎనక నుండి నడిపించిన ఎవ్వారం నాగా అల్లను కుంత్రను. మా యమ్మికి మా ఇల్లూ వాకళ్లూ అమ్మి సదివించినాం. ఉప్పుడు నీ కొడుకు మా యమ్మిని 'కోడిపిల్ల'ని గెద్దెత్తు కెల్లిపోయినట్లు- ఎత్తుకుపోతే... మా బతుకులేంగావాల? మీ మెందల దూకాల? ఇదిగీపనే - మా మొగ్గుంటలు జేస్తే ఈ ఊర్ల పెద్దలు పంచాయితీ లెట్టి జరిమానా లేత్తారు. ఉప్పుడు ఆలేటి తీర్పులు చెప్తారో. ఈ పెల్లెలా జరుగుతాదో మీమూ సూత్తాం!'' అని మీసాలు మెలేసారు మగాళ్ళు. ఆడళ్ళు ఇల్లు పీకి పందిరేసారు.

అనుకున్నట్టే కవితా, చంద్రం గుళ్ళో పెళ్ళి చేసుకొని- ఆ తరువాత రిజిస్ట్రాఫీసులో నమోదు చేయించుకున్నారు. కవిత కుటుంబం అంతటితో విడిచిపెట్టలేదు. పంచాయితీలెట్టారు. కవిత నెల జీతం ఇంటికిచ్చేయాలని పేచీ పెట్టారు. ఎలాగో తంటాలుపడి కొంత సొమ్మును కవిత కుటుంబానికి ముట్టచెప్పుకున్నాడు చంద్రం.

ఆ తరువాత తల్లిని తీసుకెళ్ళిపోయాడు.

సంవత్సరం బాగానే గడిచింది. సంవత్సరం తరువాత కవిత తల్లి కూతుర్ని చూడ్డానికి వచ్చింది. నెలరోజులుంది. ఇంట్లో తగువులు ప్రారంభమయ్యాయి. చంద్రానికి తలనొప్పి ఎక్కువయింది. చంద్రం తల్లి ''ఒరే, నాయినా! ఓపాలి ఊరెల్లి వత్తానా. ఆ ఇల్లు కూలి పోనాదో ఏటో, మీ మేనమావలు పెద్దోల్లయిపోన్ను, ఓసారి సూడాలని ఉంది. ఎల్లకాలం కచ్చలూ కావేసాలూ ఉండిపోవుగదా! కాదనకురా, ఎల్లొత్తాను'' అన్నప్పుడు- తల్లి వెళ్ళటమే చంద్రానికి మంచిదనిపించింది. కొంత సొమ్ము చేతిలో పెట్టి సరేనన్నాడు. తల్లి వెళ్ళింది. కానీ చంద్రానికి మనసు శూన్యమైపోయింది. తను తప్పుచేసానని బాధపడ్డాడు.

ఆ తరువాత ఇల్లు నరకమైపోయింది. డబ్బు మంచినీళ్ళలా ఖర్చయి పోయేది. అత్తతో పాటు, మామ, బావలూ... ఇల్లు ధ్వంసం చేయటం ప్రారంభించారు. టీ.వీలు రాత్రీ పగలూ తేడా లేకుండా వాగటం... నాటుసారా తాగి మంచాలు కుమ్మి... ఇల్లు శ్మశానంలా చేయటం... ఇంటికెవరొచ్చినా... ఒక్కక్షణం ఆనందంగా కూర్చుని మాట్లాడే తీరిక... సంతోషం కరువైన దుస్థితి! వీళ్ళవల్ల పిల్లలెలా తయారౌతారోనన్న బెంగ!



చంద్రం మనసు తుపాన్లో సముద్రమయింది.

కవితతో తీరిగ్గా మాట్లాడ్డానికే సమయం చిక్కటం లేదు.

పిల్లల అవసరాలేంటో, వాళ్ళ సరదాలేంటో తీర్చటానికి తీరుబడిలేదు. బేంకు బేలన్సు తగ్గిపోతోంది. కవిత కూడా అసహనంగా కనిపిస్తోంది. ఇంతకు మునుపు తల్లినీ, తన వాళ్ళనీ వెనకేసుకొచ్చేది. ఇప్పుడు వాళ్ళ మీద చిరాకుపడుతోంది. చీటికీమాటికీ పిల్లల మీద చెయ్యి చేసుకుంటోంది. పిల్లలు 'నాన్నమ్మ'ని తీసుకురమ్మని... అమ్మమ్మా వాళ్ళని ఇంట్లోంచి పంపించేయమని గోల చేస్తున్నారు!

ఆమె కులం తన కులం కాదనే భావన కవిత వల్ల తనకెప్పుడూ గుర్తురాలేదు!

-చంద్రం ఆలోచనల అరణ్యంలో అస్తవ్యస్తంగా తిరుగుతున్నాడు.

తల్లిని తీసుకురావాలి!

ఎవరు తల్లులతో ఎలాగుంటారో చంద్రానికి తెలీదు... కానీ- తన తల్లికి తాను తీరని అన్యాయం చేసాడు! ఆమె అవసానంలో పడుతోన్న బాధ తనని శపించక మానదు. ఆ శాపం తనకి కాదు... తన పిల్లలకు తగుల్తుంది.

పెద్దలు చేసిన తప్పులు పిల్లల పాలిట శాపాలౌతాయి.

'నా పిల్లలు నావల్ల శాపగ్రస్తులు కారాదు'.- చంద్రం మనసు ఘోషించింది.

అత్త, మామలు- ఆ బంధుగణం ఉంటే అమ్మను బతకనివ్వరు. వాళ్ళుంటే అమ్మ రానని సున్నితంగా తిరస్కరిస్తూంది. తప్పదు!

పిల్లల్ని ఆయుధంగా చేసుకొని వాళ్ళనింటి నుంచి తరమాలి!

లేదా-

వాళ్ళకి నెలకింత ఇస్తానని చెప్పి పంపాలి- వాళ్ళూ బాధ పడకూడదు!

అమ్మను తెచ్చుకోవాలి! -చంద్రం ఆటోలో కూర్చున్నాడు దుఃఖం పొంగుకొస్తోంది. ఏడుపు ఆపుకోలేకపోయాడు. రుమాలు నోటికడ్డంగా పెట్టుకున్నాడు.

***

ధర్మారావు పుస్తక పఠనంలో మునిపోయాడు. పుస్తకంలోని సారం ఆయన్ని ఆనందసాగరంలో ఓలలాడిస్తోంది. అతని ఆనందాన్ని భగ్నం చేస్తూ భార్య కేకలు కర్ణపుటాల్ని తాకేయి.

"మీకో దణ్ణం! మీకూ, మిమ్మల్ని కన్న తల్లితండ్రులకీ వేనవేల దండాలు. ఇలాంటి పాడుకొంపని తెలీక... మా నాన్న కొంపలో నన్నుపడేసాడు. మీరు చావరు... నన్ను కొరికి పోగులు పెడుతున్నారు. దిక్కుమాలిన సంత. ఆ మానుబావుడికేం పట్టదు. పుస్తకాలుంటే పెళ్ళాం, పిల్లలూ ఎలా తగలడినా పరవాలేదు... నేనూ వీటన్నిటినీ వదిలి... ఎక్కడికైనా పోదామా అంటే... ఇదిగో... ఆ ముసలిదాన్నింట్లో వదిలిపెట్టి ఊర్లమ్మట చక్రీలు కొట్టడానికి పోయిందంటారీ ఇరుగు పొరుగుల దిక్కుమాలిన జనం!"

నాన్‌స్టాప్‌గా వాగుతోన్న భార్య గొంతు.

ఆ గొంతాగదు, ధర్మారావు వెళ్ళినంతవరకూ. ఆ విషయం ధర్మారావుకి తెల్సు. 'తన తల్లి చచ్చిపోవాలి'. అదీ ధర్మారావు భార్య కోరిక. కానీ తల్లి... అంటే ఆమె అత్తగారు చావట్లేదు!

ఇప్పుడు తల్లి మీద కేకవెయ్యాలి. వెర్రితల్లి.. కళ్లు సరిగా కనిపించవు. ఎక్కడికీ వెళ్ళలేదు. దానికి తోడు షుగరు, బీ.పీ. మనవల్ని పిల్చి... వాళ్ళతో కబుర్లు చెప్పుకోవాలని ఆమె కోరిక! వాళ్ళకీ వెళ్ళా


ఫిక్సడు పళ్ళు అమర్చుటలో నూతన పద్ధతి

అమెరికాలో సభ్యత్వము పొందిన డా॥ నవీన్



డా॥ పి. నవీన్ కుమార్ రెడ్డి

గత 11 సంవత్సరాలుగా ప్రజలకు మెరుగైన దంతవైద్య శిబిరాలు ఎన్నో నిర్వహించి
ప్రజాకార్యక్రమాల్లో పాల్గొని అత్యంత అధునాతన పరికరంతో అన్నివిభాగాలతో
అమెరికాలో ప్రత్యేక శిక్షణ పొంది విదేశీ అనుభవంతో
రాయలసీమలోని అతి పెద్ద కార్పొరేట్ స్థాయి
దంత వైద్యశాల డైరెక్టర్ డా॥పి. నవీన్ కుమార్ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డైన వారికి రీయింబర్స్‌మెంట్ సౌకర్యము A.P.S.D.C.L. ఉద్యోగులకు క్రెడిట్ సౌకర్యము కలదు.
Authorised Dental Surgeon for S.B.I. Employees

ISO 9001 : 2000 సర్టిఫైడ్ మరియు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన

నవీన్ దంత వైద్యశాల

సాయిరాం వీధి, తిరుపతి. ఫోన్ : 2287887 (భవాని నగర్ ఆంజనేయస్వామి గుడి దగ్గర)

లని ఉంటుంది. వెళ్ళనివ్వదు. పని మనిషిని ఆమె పనులను చెయ్యనివ్వదు. రోజుకి రెండుసార్లు మాత్రమే అది ఆమె పనులు చెయ్యాలి! అన్నీ రూల్సే!

'అమ్మ తప్పులేకపోయినా... అమ్మని తిట్టాలి. తిట్టకపోతే తనకి భోజనం ఉండదు. కాఫీ ఉండదు. టీ ఉండదు. మనసుకు శాంతి ఉండనివ్వదు. కంటికి నిద్రరానివ్వదు.

భార్య ఒక శాడిస్ట్!'

-అందుకే ఇక జాప్యం చేసి ప్రయోజనంలేదని- ''ఏమయిందే? ఏంటి గోల?''

ధర్మారావు విధుల్లోకి హాజరయిన వైనం గమనించింది.

''నాకింత విషం ఇచ్చి వదిలించుకోండి. లేదా ఏ గేసో నాకు తెలీకుండా లీక్ చేసి నన్ను చంపి, మీరూ, మీ అమ్మ హాయిగా ఉండండి!'- ఏకరువు.

''ఏమయిందే అసలు?''

''నేను మీ అమ్మకి కాఫీ ఇవ్వలేదా? టిఫిన్ పెట్టలేదా? అన్నం పెట్టలేదా? నేనివ్వలేదని ఆ పనిమనిషితో చెప్పుకు ఛస్తోందావిడ?''

''ఏమ్మా! ఎందుకే మమ్మల్ని చంపుతావ్?''

''నేనేం అన్లేదురా నాన్నా! ఆకలేస్తోంది. ఒంట్లో బాగులేదని రాత్రేం తినకుండా పడుకొండిపోయాను. కోడలికి చెప్పవే. ఓ రెండిడ్లీ ఇవ్వమని అన్నానా. నీ మీదొట్టు. అంతకంటే నేనేం అన్లేదురా. అదేం పన్లో ఉందో. చిరాకనిపించి ఉంటుంది. నువ్వెళ్ళమ్మా. నీ పనిచూసుకో! అంది'' ఆమె రెప్పలు నీరసంగా కదుల్చుతూ.

''ఓసి, నంగనాచి! ఎంత మార్చేసేవే. నీ కొడుకు మీద ఒట్టేస్తున్నావా? అంటే నేను పసుపు కుంకుమలతో ఉండటం నీకిష్టంలేదనేగా!''

ఇప్పుడు తల్లిని తిట్టాలి. తప్పదు. లేకపోతే భార్య పిచ్చెక్కిపోతుంది. రూపం మార్చాడు. గొంతులోకి కోపం తెచ్చుకుని అన్నాడు. నటనతో ఉగ్రరూపం దాల్చాడు. ''అమ్మా! దాన్నెందుకే అన్ని హింసలు పెడతావ్. నువ్వయినా చావు మమ్మల్నయినా చంపవే! నీ పుణ్యం ఉంటుంది. ఎందుకే మాకీ నరకం. నువ్వు చచ్చిపోవే. చచ్చిపోవే అమ్మా! నీపుణ్యం ఉంటుంది!'' అని తల్లికాళ్ళు పట్టుకున్నాడు. గోడకేసి తలబాదుకున్నాడు.

ఇంతలో-

''ధర్మారావుగారూ!... ధర్మారావుగారూ!''

-ఎవరిదో పిలుపు. తలుపు దగ్గరగా వేసి వెళ్ళాడు. గాబరాపడ్డాడు. ముఖాన్ని మార్చుకున్నాడు.

''నమస్కారమండీ''

''ఎవరూ?''

''నా పేరు చంద్రమండీ! ఆ రోజు-'మదర్స్ డే' మీటింగ్‌లో 'అమ్మలేని ఇల్లు - దేవుడిలేని గుడి! - అమ్మ ఒక దేవత... ఆమె ఉన్న ఇల్లు ఓ దేవాలయం!' అన్న మీ మాటలు నన్ను మేల్కొల్పాయి. వృద్ధాప్యంలో ఒంటరిగా ఉన్న నా తల్లిని... నా భార్యని ఒప్పించి తీసుకురాగలిగాను. మిమ్మల్ని కన్నతల్లి ధన్యురాలు. ఆమె పాదాలకు వందనం చేసుకుందామని వచ్చాను. ఆ తల్లికీ కానుకలు. అవసానంలో నా తల్లి నా దగ్గర ఉండేటట్లు చేసిన మీకు నేనేమిచ్చుకోగలను? ఈ చిరు కానుక స్వీకరించండి!'' అని పట్టుపంచె, తల్లికి చీర, రెండు అయిదు వందలనోట్లు - తాంబూలం ఇచ్చి ''ఓసారి మీ తల్లిని చూపరా!'' అన్నాడు.

ధర్మారావు నలిగిపోయాడు, 'ఈ పరిస్థితుల్లోనా? భగవాన్! ఏమిటి నాకీగతి?' ''సారీ! నేను దురదృష్టవంతుణ్ణి. ఆమె చనిపోయింది!'' అని అతన్ని సాగనంపి వచ్చాడు, అతనూ బాధతోనే కదిలాడు.

''అమ్మా! నన్ను మన్నించు. నేను మాతృద్రోహిని'' అని తల్లి ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకున్నాడు.

ఆమె ఒళ్ళు చల్లబడింది. ఆమె కొడుకు క్షేమం కోరి ధర్మారావు చెప్పినట్లే చేసింది!


''అమ్మా!'' శ్లాబ్ బీటలు వారినట్లు అరిచాడు ధర్మారావు.

*

## అద్వైతం

-ప్రసాద వర్మ కామఋషి

కళ్ళు రెండు
దృష్టి మాత్రం ఒకటే
చెవులు రెండు
వినబడేది మాత్రం ఒకటే
అధరాలు రెండు
స్వరం మాత్రం ఒకటే
చేతులు రెండు
చేత మాత్రం ఒకటే
కాళ్ళు రెండు
మోస్తున్న శరీరం మాత్రం ఒకటే
పాదాలు రెండు
గమ్యం మాత్రం ఒకటే
మూతులు రెండు
ముద్దు మాత్రం ఒకటే
కిడ్నీలు రెండు
అమ్మకానికి మాత్రం ఒకటే
నాల్కలు రెండు
నాయకుడు మాత్రం ఒకడే!



★

## పిచ్చుక

-వెంకటేష్



పిచ్చుకంతే ఉంటుంది నా సెల్‌ఫోను
పిచ్చుకంత బుజ్జిగా, పిచ్చుకంత ముద్దుగా
అద్భుతమైన, అధునాతనమయిన
టెక్నాలజీ దీనిది.
కావాలంటే పిచ్చుక కిచకిచల్ని
రింగ్‌టోన్‌గా పెట్టుకోగలను
దాన్లో. లేదూ, పిచ్చుక ఫోటోని
వాల్ పేపర్‌గా అలంకరించగలను.
కానీ
ఈ సెల్‌ఫోన్ టవర్ల వలన
అంతరించిపోయిన పిచ్చుకల్లో
ఒక్కదాన్ని కూడా తేలేను
దీని టెక్నాలజీతో...

★